రహదారిపై సర్కస్ ఫీట్లు



బురదలో వాహనదారులు, పాదచారుల అవస్థలు



నెహ్రూనగర్ 10వ లైన్ ప్రధాన సెంటర్ వద్ద తవ్విన గుంత

- గత కొన్నిరోజులుగా సా....గుతోన్న పైప్‌లైన్ పనులు
- ప్రజలకు తప్పని తిప్పలు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ పైపుల పనులతో నగర వాసులకు తిప్పలు తప్పడం లేదు. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్యనగర్ రైల్వేగేటు వరకు గతంలో ఉన్న 800ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 ఎంఎం డయా పైపులైన్ పనులను ఇంజినీరింగ్ అధికారులు గత కొద్దిరోజులు నుంచి చేస్తున్నారు. వాటర్ ట్యాంకుల నుంచి నెహ్రూనగర్ 10వ లైన్ సెంటర్ వరకు వేగంగానే సాగాయి. కానీ ఆ సెంటర్ నుంచి పైపులైన్ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు తీసిన గోతులకు వర్షం కూడా తోడవ్వడంతో బురదలో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కనీసం అడుగు తీసి అడుగెయ్యాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి. ఇక ద్విచక్రవాహన చోదకుల పరిస్థితి వర్ణనాతీతం. గుంతల పక్కన ఉన్న సన్నని బాటపై బతుకుజీవుడా అంటూ దాటాల్సిన పరిస్థితి. సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, శివనాగరాజు కాలనీ, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల నుంచి కొత్తపేట వైపు వెళ్లేందుకు, వచ్చేందుకు ఇదే ముఖ్యమైన రహదారి కావడంతో ప్రమాదమని తెలిసినా ఇటువైపుగానే వస్తున్నారు. నెహ్రూనగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు.. నగరంలోని పలు ప్రాంతాల్లోని కళాశాలలకు వెళ్లేందుకు ఇదే దగ్గరిదారి అవ్వడంతో విద్యార్థులు సైతం ఇటువైపుగానే వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పైపులైన్ పనులను వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం జరగనుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10గంటల నుంచి 1గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో స్పందన ఉంటుందని స్థానికంగా పరిష్కారం కానీ సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణను అడ్డుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఆదివారం సహా సెలవు రోజుల్లో యథేచ్ఛగా విద్యార్థులకు తరగతుల నిర్వహణ కొనసాగుతోందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయిచరణ్ గుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో సైతం విద్యార్థులకు సెలవు ఇవ్వకుండా తరగతుల నిర్వహణపై ఇంటర్‌బోర్డు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లక్ష్మీపురం, చంద్రమౌళీనగర్‌లోని వివిధ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విషయమై ఆర్‌ఐఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఎమర్జెన్సీతో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి రంగరాజు

గుంటూరు మెడికల్: ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం గుంటూరు లాల్‌పురంరోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని మాధవరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఎమర్జెన్సీ ప్రకటించిన రోజు చరిత్రలో మాయని మచ్చగా పేర్కొన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, నాటిప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించారని చెప్పారు. రాష్ట్ర కిసాన్‌మోర్చా ఇంచార్జ్ చందు సాంబశివరావు మాట్లాడుతూ పౌర హక్కులను కాలరాస్తూ 21నెలలపాటు కొనసాగిన నియంతృత్వ పాలనకు ఎదురొడ్డి ప్రజాస్వామ్య పరిరక్షణకై పాటుపడిన వీరులందరికి వందనాలని తెలిపారు. సమావేశంలో పశ్చిమ అసెంబ్లీ కన్వీనర్ తోట రామకృష్ణ, ఐటీ కన్వీనర్ మకుటం శివ, ప్రవాస్ యోజన సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశ్వంత్, ఉపాధ్యక్షురాలు మంత్రి సుగుణ పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రులు

ఈ నెల 28వ తేదీ పూర్ణాహుతి

పాత గుంటూరు: శ్రీనగర్ 6వ లైనులోని లలితా పరమేశ్వరి దేవస్థానంలో రాజశ్యామల పీఠం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో కనుల పండుగగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్ర నామార్చనలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అమ్మవారి మూలమంత్రంతో వారాహి హోమం వేదోక్తంగా చేసారు. గణపతి, దుర్గ మంత్రాలతో హోమం జరిపారు. పీఠ వ్యవస్థాపకులు వెలమకన్ని నాగార్జున శర్మ మాట్లాడుతూ ఈ నెల 28 తేదీ పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సందీప్ శర్మ, వల్లూరి హనుమత్ సాయి. సన్నిధానం వ్యాసనారాయణ, అభిషేకాలు హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

నాటా సభలకు శాంతమూర్తికి ఆహ్వానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు యూఎస్‌ఏలోని డల్లాస్‌లో జరగనున్న తెలుగు ప్రతినిధుల సభలకు గుంటూరు నగరానికి చెందిన జి.శాంతమూర్తి ఆహ్వానం అందుకున్నారు. డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో జగరనున్న సభల్లో భాగంగా అమెరికా, కెనడాల్లో నివశిస్తున్న తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం, వివిధ అంశాలపై చర్చతో పాటు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు జరగన్నుట్లు శాంతమూర్తి ఆదివారం తెలిపారు. కాగా శాంతమూర్తి అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపకుడిగా ఉన్నారు.

కోదండరామాలయంలో సుదర్శన హోమం

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండరామాలయంలో ఆదివారం సుదర్శనహోమం నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి విశేష అర్చనలు అర్చకులు కృష్ణమూర్తి నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, మండపారాధన , కలశ పూజలు చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలలో నవగ్రహ, సుదర్శన, లక్ష్మీగణపతి హోమాలను రుత్వికులు నారాయణం గోవర్ధన రఘురామ్, సాయి, అజయ్‌కుమార్, వినయ్‌కుమార్ నిర్వహించారు.

శ్మశానవాటికకు వాహనం అందజేత

పట్నంబజారు: ఒక చెట్టు నాటితే జీవితాంతం నీడనిస్తుందని..ఒక స్వచ్ఛంద సంస్థ ఎంతో మందికి సేవనందిస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. పాతగుంటూరులోని హిందూ శ్మశాన వాటికకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి వాహనం (మార్చురీ వాహనం) అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన చేయటంతో పాటు, నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే రీతితో శ్మశానవాటికను తీర్చిదిద్దుతామని చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మొహమూద్, యిర్రి సాయి, సంస్థ సభ్యులు వజ్రాల వెంకటనారిరెడ్డి, రమేష్, రామారావు, గురవారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు సుబ్బారెడ్డి, సుబ్బులు, ఆదినారాయణరెడ్డి, పాపారావు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

విద్యార్థులను చేర్పించేందుకు యూటీఎఫ్ ప్రచారం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం పేరుతో ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా, మండల కమిటీల సభ్యులు జిల్లా వ్యాప్తంగా ఆవాస ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, తల్లిదండ్రులను కలిసి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో సహజ సిద్ధ వాతావరణంలో మనోవికాస అభివృద్ధితో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలలకే సాధ్య మన్నారు. పాఠశాలలను కాపాడుకునే బాధ్యతలను తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు స్వీకరించినప్పుడు ప్రభుత్వ బడులకు ప్రత్యామ్నాయం ఉండ దని అన్నారు. ఆ విధంగా కృషి చేసి ప్రభుత్వ విద్యావ్యవస్థను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గురుబ్రహ్మం, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆదిలక్ష్మి, కళాధర్ తదితరులు

ముస్లింల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

వక్ఫ్ బోర్డు జిల్లా ప్రెసిడెంట్ షేక్ జిలాని

ప్రత్తిపాడు: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మక్కా మసీదు, పెదనందిపాడు మండలం గోగులమూడిలోని మసీదుల వద్ద ఆదివారం రాత్రి జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ జిలానీ ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన జిలాని ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవ్వరైనా ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయంలో దరఖాస్తు అందించాలని కోరారు. గతంలో ముస్లింల అభ్యున్నతికి అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండడుగులు ముందుకు వేస్తే, ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ముస్లింలకు రాజకీయంగానూ తగిన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర క్యాబినెట్‌లోనూ అవకాశాలిచ్చి సీఎం సుపరిపాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఆదాయం లేక ఇబ్బందుల్లో ఉన్న మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్‌లను ఆర్థికంగా ఆదుకునేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ కరిముల్లా, మండల మైనారిటీ సెల్ కన్వీనర్ సయ్యద్ అమీర్‌బాషా, మసీదు కమిటీ సభ్యులు లియాకత్ అలీ, మహమ్మద్ ఖాశిం, షరీఫ్, బాజి, ప్రత్తిపాడు మండల కోఆప్షన్ మెంబర్ వసీం, పార్టీ నాయకులు షేక్ బాజి, ప్రత్తిపాడు, గోగులమూడి మసీదుల కమిటీ సభ్యులు, మత పెద్దలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని, మత పెద్దలు

నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- సినీ నటుడు సుమన్
- రాష్ట్ర నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం

గుంటూరు రూరల్: నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ప్రముఖ సినీ నటుడు, హీరో సుమన్ తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో ఇటీవల రాష్ట్ర నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన కవులూరి పీర్ మొహమ్మద్‌ను శివసేన మిత్రమండలి ఆధ్వర్యంలో సినీ నటుడు సుమన్ చేతుల మీదగా ఘనంగా సన్మానం చేశారు. సుమన్ మాట్లాడుతూ పీర్ మహమ్మద్ మరిన్ని ఉన్నత పదవులకు ఎదగాలని ఆకాంక్షించారు. అదే విధంగా సంఘ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. డాక్టర్ కృష్ణశ్రవంత్ మాట్లాడుతూ మహమ్మద్ సంఘ అధ్యక్షులుగా ఎన్నికైనందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. తోట శ్రీనివాస్, కృష్ణశ్రవంత్, నీలిమ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ చెన్నంశెట్టి వెంకటశివ, పేరం నగేష్, శివ సేన మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.



నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కవులూరి పీర్ మహమ్మద్‌ను సన్మానిస్తున్న సినీనటుడు సుమన్

వృద్ధురాలు అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వృద్ధురాలు కనిపించ కుండాపోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌ఎస్‌పీ క్వార్టర్స్‌లో నిసించే 70 సంవత్సరాల జంగాల సాలమ్మ శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయిందని నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం..

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధ్రువనాధులు సుబ్బారావు ఈ నెల 22వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయిన ఘటనపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ ఘటనపై ఫిర్యాదు

పట్నంబజారు: ఇంటి తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందివెలుగు రోడ్డులో నివాసం ఉండే కంచర్ల సుబ్బారావు ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తారు. కుటుంబంతో కలిసి ఓ కార్యక్రమం నిమిత్తం ఆదివారం దాచేపల్లి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులకొట్టి ఉండటాన్ని గమనించారు. 30 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు పోయినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మహిళ గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వడ్లమూడి ముస్లిం ఏరియాకు చెందిన షేక్ రిజ్వానా ఇంటి ఆవరణలో బైండింగ్ వైర్‌పై బట్టలు ఆరవేసే సమయంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగలటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: మండలంలోని రత్నగిరినగర్‌లోగల అభయా ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆదివారం 16 రోజుల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు సమీప గ్రామాల ప్రజలు 2 వేల మందికిపైగా పాల్గొని స్వామి తీర్థ ప్రసాదం స్వీకరించారు. భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

యువకుడిపై ఇనుపరాడ్‌తో దాడి

చేబ్రోలు: స్వల్ప విషయంలో యువకుడిపై ఇనుపరాడ్‌తో దాడి చేయటంతో తలకు గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చీలిపాలెం ప్రాంతానికి చెందిన ముళ్లపూడి అశోక్‌పై అదే ప్రాంతానికి చెందిన పద్మరాజు మరికొంతమంది కలసి దాడి చేసి గాయపరిచినట్లు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పెదనందిపాడు: రోడ్డు పక్కన ఉన్న కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పెదనందిపాడు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాలు.. పెదనందిపాడు బాపట్ల రహదారి పక్కన ఉన్న కాల్వలో 35 సంవత్సారాల వ్యక్తి మృతదేహం ఉందని, మృతదేహంపై సిమెంట్ రంగు గళ్ల షర్టు ధరించి ఉన్నాడని, ఆచూకి తెలిసిన వారు పెదనందిపాడు ఎస్‌ఐ నంబర్ 9440900872కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉమ్మడి పౌరసత్వం దేశానికి శ్రేయస్కరం

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సోమసాని బ్రహ్మానంద రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి పౌరసత్వ చట్టం ద్వారా దేశం అనేక రంగాల్లో పురోభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సోమసాని బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. భారత వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో యూనిఫామ్ సివిల్ కోడ్ అంశంపై ఆదివారం సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-సాధు సుబ్రహ్మణ్యం జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో సదస్సు నిర్వహించారు. భారత వికాస్ పరిషత్ గుంటూరు శాఖ అధ్యక్షుడు టీఎన్ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయవాది జూపూడి రంగరాజు మాట్లాడుతూ స్వాతంత్రానంతరం కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలతో ప్రజల మధ్య అంతరాలు ఏర్పడిన నేపథ్యంలో దివంగత ప్రధాని వాజ్‌పేయి ఉమ్మడి పౌరసత్వంపై రాజ్యాంగ సమీక్షకు సంకల్పించారని అన్నారు. కామన్ సివిల్ కోడ్ ద్వారా దేశ ప్రజల మౌలిక సామాజిక సమగ్రాభివృద్ధి కోరుకునే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కలుగుతుందని తెలియజేశారు. ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కరోనా దేశ ప్రజల నిర్భయత్వాన్ని మరింతగా పెంచిందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తు సవాళ్లను ముందుగానే గమనిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు ఇప్పటికే గుర్తించాయని, ప్రజలు ఆ దిశగా రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ భారత వికాస్ పరిషత్ గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాలకతీతంగా దేశ అభ్యున్నతి కోసం కార్యక్రమాలు రూపొందించుకుని అమలు చేస్తుందని వివరించారు. తులసీ యోగీష్‌చంద్ర, సేవాభారతి శ్రీవల్లి, అంకిత్ కుమార్ జైన్, సీహెచ్ చలమయ్య, రఘువీర్, భారత వికాస్ పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం ప్రారంభం

పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శృంగేరీ శంకరమఠం శారదా పరమేశ్వరీ దేవస్థానంలో 108వ శ్రీ మద్భాగవత పారాయణ పూర్వక సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదమూర్తులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు నిర్వహణలో గురువందనం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షాబంధనం, రుత్విగ్వరణం, కలశ స్థాపన, అఖండ దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ మద్భా గవత మహత్యం పారాయణం ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వేదమూర్తులు మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు గురువందనం, పారాయణ ప్రారంభం, 9 గంటలకు మద్భాగవత మహాపురాణ ప్రవచనం, 11 గంటలకు భాగవత పారాయణం జరుగుతుందని తెలిపారు. ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీ హరి ప్రసాదరావు, పండితులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేదమూర్తులు

అవార్డులకు ప్రతిభే ప్రామాణికం కావాలి

పాత గుంటూరు: అవార్డులు ఎవరికిచ్చినా ప్రతిభ ప్రామాణికంగానే ఇవ్వాలని, అవార్డు ప్రకటించాక దానిపై విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపైనే వుందని నటకంఠీరవ బిరుదాంకితులు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి మిత్రుల కలయిక-కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ కొత్తతరాన్ని ప్రోత్సహించకపోతే భవిష్యత్ తరాల సాహితీరంగమంతా శూన్యంగా మారే ప్రమాద ముందన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ శ్యామ ఆంగ్ల పుస్తకాన్ని కందిమళ్ల శివప్రసాద్ తెలుగులో అనువదించగా, డాక్టర్ వంగిపురపు శారదాదేవి సమీక్షించారు. అనంతరం కవి సమ్మేళనంలో సోపాటి ప్రభాకర్, ఆళ్ల నాగేశ్వరరావు, రహీమ్ సాహెబ్, కారంచేటి విజయ్ కుమార్, గోలి హనుమచ్ఛాస్త్రి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, మన్నం వెంకటగురువు, కొణతం నాగేశ్వరరావు, కె.లీలాకృష్ణ, బాబూ మస్తాన్, పింగళి భాగ్యలక్ష్మి, మండే సుబ్రహ్మణ్యంలు తమ కవితల్ని వినిపించారు. ఉత్తమ కవిత రాసిన మండే సుబ్రహ్మణ్యంను నగదు బహుమతితో సత్కరించారు. ముఖ్యఅతిథి రాధాకృష్ణమూర్తిని పుస్తకం అందించి, శాలువాతో సత్కరించారు. బండికల్లు జమదగ్ని పర్యవేక్షించారు.



రాధాకృష్ణమూర్తిని సత్కరించిన కలిమిశ్రీ, రాజేంద్రప్రసాద్

జ్ఞాపకాలను సజీవంగా నిలిపేవి ఫొటోలు

ఎమ్మెల్సీ ఎల్.అప్పిరెడ్డి

పట్నంబజారు: జ్ఞాపకాలను జీవితాంతం మనకు కళ్లకు కట్టినట్లు చూపేవి ఫొటోలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గ్రామీణ జీవన సౌందర్యం – గిరిజనుల జీవనశైలి అనే అంశంపై గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామానికి చెందిన దామరచర్ల శంకరరావు తీసిన ఫొటోలకు ఫొటోగ్రఫీ రంగంలోనే ప్రతిష్టాత్మక అమెరికా పురస్కారం లభించింది. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, తాను తీసిన ఫొటోలను చూపించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ఇమేజ్ కొలీగ్ సొసైటీ తనను అసోసియేట్ షిప్ హానర్‌కు ఎంపిక చేస్తూ పంపిన సర్టిఫికెట్‌ను ఎమ్మెల్సీ అప్పిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రీల్స్‌తో ఫొటోలు తీసే స్థాయి నుంచి చిన్న మెమొరీ కార్డుతో వందలాది ఫొటోలు తీసే స్థాయికి నేడు ఫొటోగ్రఫీ ఎదిగిందన్నారు. ఎన్నో విలువైన రూపాలను, మరెన్నో ప్రత్యేకమైన మధుర జ్ఞాపకాలను ఇప్పటికీ, ఎప్పటికీ, ఏనాటికీ సజీవంగా నిలిపి ఉంచేవి ఫొటోలు మాత్రమేనని తెలిపారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), గుంటూరు జిల్లా ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సలహా సంఘం చైర్మన్ కె.కృష్ణ, అధ్యక్షుడు సంకా శ్రీనివాసరావు, డాక్టర్ ఏవీ వెంకటరమణ, కె.దుర్గాప్రసాద్, టి.హరిబాబు ఉన్నారు.



శంకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, లాలుపురం రాము తదితరులు

• డేంజర్ జర్నీ

ప్రత్తిపాడు: ఆటోవాలాలు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలను నడుపుతూ ప్రమాదానికి కారణమవుతున్నారు. మితిమీరి సరుకును వాహనాల్లో నింపుతుండటంతో రహదారులపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. కొన్ని సందర్భాల్లో మెయిన్ రోడ్లపై ఉన్న విద్యుత్ తీగలకు సరుకు తగులుతుండటం, మంటలు వ్యాప్తి చెందుతుండగా, మరికొన్ని సార్లు విద్యుత్ వైర్లు తెగి పడుతున్నాయి. దీంతో పొరబాటున పెనుప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆటోవాలాలు నడిపే వేగానికి సరుకు ఎక్కడ కిందపడిపోతుందోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవ్వాల్సిన పరిస్థితి చోటుచేసుకుంటుంది. సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

